
సాక్షి అనంతపురం

మంగళవారం। 7। మార్చి। 2023



చీనీ టన్ను రూ.34 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.34 వేలు పలికాయి.



టమాట కిలో రూ.20

కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.20, కనిష్టం రూ.4.50, సరాసరి రూ.10 పలికింది.



జిల్లా అంతటా సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. చాలా ప్రాంతాల్లో ఉదయం పూట చలి వాతావరణం కొనసాగింది.

న్యూస్‌రీల్

గజేంద్ర వాహనంపై చెన్నకేశవ వైభవం



యాడికి: శివలక్ష్మీ చెన్నకేశవుడి బ్రహ్మోత్సవాలు యాడికిలో వైభవంగా సాగుతున్నాయి. సోమవారం రాత్రి చెన్నకేశవ స్వామి గజేంద్ర వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అర్చకుడు హరికృష్ణశర్మ ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి 10గంటలకు మూలా సాయి సుబ్రహ్మణ్యం కుమారులు సాయినాథ్, భానుప్రకాష్ ఆధ్వర్యంలో ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు.

ప్రాక్టికల్ పరీక్షలకు 62 మంది గైర్హాజరు



రాప్తాడురూరల్: ఇంటర్ ద్వితీయ సంవత్సరం ప్రాక్టికల్స్ పరీక్షల్లో భాగంగా సోమవారం జరిగిన రెండు విడతల పరీక్షలకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో 62 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం 64 కేంద్రాల్లో పరీక్ష జరగగా 1,780 మంది విద్యార్థులకు గాను 1742 మంది హాజరయ్యారు. 38 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం విడతలో 61 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా 1,508 మంది విద్యార్థులకు గాను 1484 మంది హాజరయ్యారు. 24 మంది గైర్హాజరయ్యారు.


22 నుంచి ఉగాది ఉత్సవాలు



సమావేశంలో మాటాడుతున్న ఆర్డీఓ రవీంద్ర

గుంతకల్లు: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో ఈ నెల 22న ఉగాది ఉత్సవాలు ప్రారంభమవుతాయని గుంతకల్లు ఆర్డీఓ రవీంద్ర తెలిపారు. మూడు రోజులు పాటు జరిగే ఉత్సవాలను ఘనంగా జరుపుకుందామని పిలుపునిచ్చారు. సోమ వారం ఉగాది ఉత్సవాల ఏర్పాట్లపై దేవస్థానంలో ఈఓ డి.వెంకటేశ్వర్లుతో కలిసి వివిధ శాఖల అధికారులతో ఆర్డీఓ సమీక్ష నిర్వహించారు. ఉత్సవాల్లో 22న గ్రామోత్సవం, 23న రథోత్సవం, 24న లంకాదహనం ఉంటుందన్నారు. ఉత్సవాలకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక నుంచి వేలాదిమంది భక్తులు హాజరవుతారన్నారు. వారికి ఇబ్బందులు కలగకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. 30న శ్రీరామ నవమికి కావాల్సిన ఏర్పాట్లపైనా చర్చించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్‌పర్సన్ సుగుణమ్మ, మున్సిపల్ కమిషనర్ బండిశేషన్న, ఆలయ ఏఈఓ ధనుంజయ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి



సూచనలిస్తున్న డీఐజీ రవిప్రకాష్

బుక్కరాయసముద్రం: గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతలపై దృష్టి పెట్టాలని డీఐజీ రవిప్రకాష్ పోలీసు సిబ్బందిని ఆదేశించారు. సోమవారం సాయంత్రం బుక్కరాయసముద్రం పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. స్టేషన్ పరిధిలో ఏటా 400 వరకు నేరాలు జరుగుతున్నాయని, ఇందులో ఎక్కువగా భూ తగాదాలు, ఆత్మహత్య కేసులు, ఉన్నాయని డీఐజీ పేర్కొన్నారు. పోలీసు సిబ్బంది నిజాయితీగా పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. 'దిశ' యాప్‌పై అమ్మాయిలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా నడుచుకుంటూ పోలీసు ప్రతిష్టను పెంపొందించాలన్నారు. శాంతి భద్రదతలకు విఘాతం కలిగించే వారు ఎంతటివారైనా విడిచి పెట్టేది లేదన్నారు. రౌడీ షీటర్ల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. మట్కా, జూదం, అక్రమ మద్యం అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ సీఐ అస్రార్ బాషా, ఎస్‌ఐ శివప్రసాద్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బ్రాండెడ్ పేరిట దోపిడీ

- కమీషన్ల కోసం బ్రాండెడ్ మందుల వైపే వైద్యుల మొగ్గు
- రేటులో జనరిక్, బ్రాండెడ్ మధ్య భారీ తేడా
- ఏటా రూ.కోట్లలో నష్టపోతున్న సామాన్యులు
- జనరిక్ మందులే రాయాలన్న నేషనల్ మెడికల్ కమిషన్
- ఉమ్మడి జిల్లాలో నిబంధనలు బేఖాతరు చేస్తున్న ప్రైవేటు వైద్యులు



డ్రగ్ మాఫియా రాజ్యమేలుతోంది. తమ కంపెనీ ఉత్పత్తి చేస్తున్న బ్రాండెడ్ మందులనే రోగులకు రాయాలని ప్రైవేట్ డాక్టర్లను శాసిస్తోంది. ఇందు కోసం డాక్టర్లకు విందులు, వినోదాలు, విదేశీ, విహార యాత్రలు, బహుమతులు, కమీషన్ల వంటి నజరానాలందిస్తోంది. వీటికి అలవాటుపడిన డాక్టర్లు అతి తక్కువ ధరకే లభించే జనరిక్ మందులను కాదని 50 నుంచి 90 శాతం మేర ఎక్కువ ధర కలిగిన బ్రాండెడ్ మందులను రాస్తున్నారు. మేము రాసిన బ్రాండెడ్ మందులు వాడితేనే నయమవుతుందంటూ రోగుల్లో భయాందోళన సృష్టిస్తున్నారు. జనరిక్ మందులే రాయాలన్న నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) నిబంధనలను ప్రైవేట్ డాక్టర్లు బేఖాతరు చేస్తున్నారు. వారి ఆదాయం పెంచుకోవడం కోసం పేద రోగులను 'బ్రాండెడ్ మందులు' పేరిట ఆర్థికంగా పీల్చి పిప్పి చేస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, అనంతపురం:

- ✓ ఒక క్యాన్సర్ పేషెంటు డోసిటాక్సిల్ అనే ఇంజక్షన్ కొనుక్కుంటే బ్రాండెడ్ ధర రూ.80 వేలు, అదే జనరిక్ మందు అయితే రూ.8వేలే.
- ✓ రోజూ వాడే యాంటీబయోటిక్స్ మందుల్లో కూడా అంతే. సిఫిగ్జిమ్ 200 ఎంజీ యాంటీబయోటిక్ బ్రాండెడ్‌లో కొంటే రూ.1250, అదే జనరిక్‌లో రూ.450 మాత్రమే.

కమీషన్లకు ఆశపడుతున్న డాక్టర్ల వల్ల పేద రోగులు నష్టపోతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో బ్రాండెడ్ మందుల కొనుగోలుతో రోగులు భారీగా డబ్బు చెల్లించాల్సి వస్తోంది. బ్రాండెడ్ మందులు, జనరిక్ మందులకూ చికిత్సపరంగా తేడా ఉండదు. కానీ రోగం తగ్గాలంటే బ్రాండెడ్ మందులే పనిచేస్తాయని కొంతమంది డాక్టర్లు చెబుతుండటంతో రోగులు నమ్ముతున్నారు. దీంతో భారమైనా బ్రాండెడ్‌వైపే మొగ్గు చూపుతున్నారు. ఓవైపు నేషనల్ మెడికల్ కమిషన్ జనరిక్ మందులను ప్రోత్సహించాలని, రోగులకు వ్యయ భారం తగ్గించాలని, డాక్టర్లు చీటీలు కూడా ఇంగ్లిష్ కేపిటల్ లెటర్స్‌లో అందరికీ అర్థమయ్యేలా రాయాలని సూచిస్తున్నా ప్రైవేట్ డాక్టర్లు బ్రాండెడ్ మందులనే సిఫార్సు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 2,200 మెడికల్ స్టోర్లు ఉండగా.. ఎక్కువగా బ్రాండెడ్ మందులే అమ్ముడుపోతున్నాయి.

బ్రాండెడ్‌కూ..జనరిక్‌కూ తేడా ఏమిటి?

బ్రాండెడ్ అంటే ఒక కంపెనీ కొత్త మందును కనుక్కుని దానికి క్లినికల్ ట్రయల్స్ నిర్వహించి, దాన్ని మార్కెట్లోకి తీసుకొచ్చేందుకు తమ కంపెనీ పేరు మీద బ్రాండెడ్ మెడిసిన్‌గా ముద్ర వేసుకుంటారు. ఈ మందుపై ఆ కంపెనీకి 10 సంవత్సరాల పేటెంట్ ఉంటుంది. ఆ తర్వాత ఆ మందును అదే ఫార్ములాతో ఎవరైనా తయారు చేసుకోవచ్చు. దీన్నే జనరిక్ మందులు అంటారు. బ్రాండ్ ఇమేజ్ అవసరం లేదు కాబట్టి తయారీ వ్యయం తక్కువ. డ్రగ్స్ కాంబినేషన్ అదే ఉంటుంది. తయారీలోనూ తేడా ఉండదు. ధరలో మాత్రం భారీ తేడా ఉంటుంది.



కొన్ని క్యాన్సర్ మందుల ధరల్లో తేడా ఇలా..

మందు	మోతాదు	బ్రాండెడ్ ధర	జనరిక్ ధర
డోసిటాక్సిల్	120 ఎంఎల్	రూ.80 వేలు	రూ.8 వేలు
టాక్సిటోసిల్	300 ఎంజీ	రూ.20వేలు	రూ.6 వేలు
ఎర్లోటినిబ్	30 మాత్రలు	రూ.1,00,000	రూ.15 వేలు
పాపెసిటాబిన్	60 మాత్రలు	రూ.12వేలు	రూ.3,500

కొన్ని సాధారణ మందులు	మోతాదు	బ్రాండెడ్ ధర	జనరిక్ ధర
సిఫిగ్జిమ్	200ఎంజీ	రూ.1250	రూ.450
సిట్రిజన్	10 ఎంజీ 100 మాత్రలు	రూ.260	రూ.20
మల్టీవిటమిన్	100 మాత్రలు	రూ.1000	రూ.300
పారాసిటమాల్ 500ఎంజీ	100 మాత్రలు	రూ.130	రూ.30
మెట్‌ఫార్మిన్ 150ఎంజీ	100 మాత్రలు	రూ.200	రూ.30

జనరిక్‌పై అవగాహన కల్పించాలి



జనరిక్ మందులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలి. రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, పాఠశాలలు, ఆస్పత్రులు తదితర ప్రధాన సర్కిళ్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలి. పత్రికలు, టీవీల్లో విస్తృతంగా ప్రచారం చేసి ప్రజలు జనరిక్ మందులు వాడేటట్లు చూడాలి. విధిగా ప్రభుత్వ, ప్రైవేట్ హాస్పిటళ్లలో జనరిక్ మందుల దుకాణాలు ఏర్పాటు చేయాలి.

జనరిక్ మందులే రాయాలి

నేషనల్ మెడికల్ కమిషన్ ఆదేశాల ప్రకారం ఏ వైద్యులైనా తక్కువ ధరకు లభించే జనరిక్ మందులనే రాయాలని ఆదేశించాం. దీంతో పాటు ఆ మందులను ప్రిస్క్రిప్షన్‌లో ఇంగ్లిష్ కేపిటల్ లెటర్స్‌లోనే రాయాలని సూచించాం. డాక్టర్లు నైతికతతో ఉండాలి.

–డాక్టర్ సాంబశివారెడ్డి,
ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్

రెండు రకాల డాక్టర్లున్నారు

జనరిక్ మందులు ఒక బాక్స్‌కు మరో బాక్స్ ఫ్రీగా వస్తే.. జనరిక్ మందులు మాత్రమే రాసే డాక్టర్లు కొందరు ఉన్నారు. నర్సింగ్‌హోంలోనే మెడికల్‌షాప్ పెట్టుకుని, బ్రాండెడ్ కంపెనీల నుంచి లాభాలు పొందే వాళ్లు మాత్రం బ్రాండెడ్ మందులే రాస్తారు. రెండు మందులూ ఒకే రకంగా పనిచేస్తాయి. జనరిక్ రాస్తే పేదలకు ఆర్థిక ఉపశమనం కలుగుతుంది.

–డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి,
హృద్రోగ నిపుణుడు

చల్లచల్లగా ఆర్టీసీ ప్రయాణం

- దూర ప్రాంతాలకు ఏసీ సర్వీసులు
- ప్రయాణికులకు అనువుగా బస్సు వేళలు
- తక్కువ చార్జీతోనే సౌకర్యవంతమైన జర్నీ

అనంతపురం సెంట్రల్: ప్రైవేట్ ట్రావెల్స్‌కు దీటుగా ప్రయాణికులకు ఆర్టీసీ సేవలందిస్తోంది. సురక్షిత ప్రయాణంతో పాటు సౌకర్యవంతమైన సదుపాయాలు కల్పిస్తోంది. వేసవిని దృష్టిలో పెట్టుకొని దూరప్రాంతాలకు ఏసీ బస్సులు తిప్పాలని నిర్ణయించింది. ఇప్పటి వరకు విజయవాడ, హైదరాబాద్, తిరుపతి, బెంగళూరు ప్రాంతాలకు వెళ్లాలంటే ఎక్కువశాతం మంది ఏసీ సౌకర్యం కలిగిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల వైపు మొగ్గుచూపేవారు. ఆర్టీసీ కూడా ఇప్పుడు ఏసీ బస్సులను నడుపుతోంది. రైల్వే తరహాలో ఆర్టీసీ ఏసీ బస్సులో మినరల్ వాటర్ బాటిల్, బ్లాంకెట్ (దుప్పటి) అందివ్వనుంది. తప్పని సరిగా టీవీ సౌకర్యం ఉంటుంది. ప్రైవేటు ట్రావెల్స్‌తో పోలిస్తే ఆర్టీసీలో బస్సు చార్జీ చాలా తక్కువగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

ఏ డిపో నుంచి ఏ సమయంలో ఏసీ బస్సు బయల్దేరుతుందంటే..

- తాడిపత్రి – గుత్తి – హైదరాబాద్ (ఉదయం 10 గంటలకు)
- హైదరాబాద్ (బీహెచ్‌ఈఎల్) నుంచి తాడిపత్రి (రాత్రి 9 గంటలకు)
- అనంతపురం – కర్నూలు– విజయవాడ (రాత్రి 9 గంటలకు)
- అనంతపురం – హైదరాబాద్ (రాత్రి 11 గం॥)
- హైదరాబాద్ (ఎంజీబీఎస్)– అనంతపురం (రాత్రి 9 గంటలకు)
- అనంతపురం – బెంగళూరు (ఉదయం 10 గం॥)
- అనంతపురం – తిరుపతి (రాత్రి 10 గంటలకు)
- తిరుపతి – అనంతపురం (ఉదయం 10 గం॥)
- సదరు బస్టాండ్ నుంచి బస్సు బయల్దేరుతుంది



ఆర్టీసీ ఏసీ బస్సుల్లో చార్జీ

రూటు	టికెట్
తాడిపత్రి - హైదరాబాద్	రూ.1,250
అనంతపురం - హైదరాబాద్	రూ. 800
అనంతపురం - విజయవాడ	రూ.1,080
అనంతపురం - బెంగళూరు	రూ.500
అనంతపురం - తిరుపతి	రూ.660

ప్రయాణికుల సౌకర్యార్థమే..



సురక్షిత, సౌకర్యవంతమైన ప్రయాణమే ఆర్టీసీ లక్ష్యం. ప్రస్తుతం వేసవి కాలం ఆరంభమవుతోంది. ప్రయాణికుల సౌకర్యార్థం ఏసీ బస్సు సర్వీసులు నడుపుతున్నాం. ప్రయాణికులకు వీలుగా బస్సు రూట్‌లు తిప్పుతున్నాం. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

– సుమంత్ ఆర్ ఆదోని,
జిల్లా ప్రజా రవాణా అధికారి

హనుమంత వాహనంపై ఖాద్రీశుడు



హనుమంత వాహనంపై లక్ష్మీ నారసింహుడికి పూజలు చేస్తున్న అర్చకులు

కదిరి: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు కమనీయంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో ఐదో రోజైన సోమవారం రాత్రి శ్రీవారు హనుమంత వాహనంపై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. నరసింహావతారంలో హిరణ్యకశ్యపుని సంహారం అనంతరం శ్రీమహావిష్ణువును సాక్షాత్తు హనుమంతుడే దిగివచ్చి తన భుజస్కంధాలపై మోస్తాడని భక్తుల నమ్మకం. హనుమంతుని భక్తి తత్పరతను నేటి తరం వారికి వివరిస్తూ రాముడు, కృష్ణుడు, నారసింహుడు అన్నీ తానేనని స్వామి వారు తెలియజేస్తారని అర్చకులు వివరించారు. భక్తుల కాలక్షేపం కోసం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి.

నేడు బ్రహ్మ గరుడసేవ

ఖాద్రీ నారసింహుడు మంగళవారం గరుడవాహనంపై తిరువీధుల్లో భక్తులకు దర్శనమిస్తారు. బ్రహ్మోత్సవాలకు సృష్టికర్త అయిన బ్రహ్మదేవుడే ఈ బ్రహ్మోత్సవాలను దగ్గరుండి నడిపిస్తారని భక్తుల నమ్మకం.

పెద్దారెడ్డి పాదయాత్రకు నీరాజనం



భారీ జనసందోహం నడుమ చాగల్లు ప్రాజెక్టు మీదుగా సాగుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పాదయాత్ర



పెద్దారెడ్డికి సంఘీభావంగా యాత్రలో పాల్గొన్న మంత్రి ఉషశ్రీ చరణ్

- వేలాదిగా తరలివచ్చిన ప్రజలు
- ఉత్సాహంగా సాగిన యాత్ర
- మంత్రి ఉషశ్రీ చరణ్ సంఘీభావం

పెద్దపప్పూరు: తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చేపట్టిన ప్రజాసంక్షేమ పాదయాత్రకు ప్రజలు నీరాజనం పడుతున్నారు. పెద్దపప్పూరు మండలంలో ఏడో రోజు సోమవారం పాదయాత్ర చెర్లోపల్లి నుంచి ప్రారంభమై తురకపల్లి, చిన్నయక్కలూరు మీదుగా చాగల్లు వరకు కొనసాగింది. ఈ పాదయాత్రకు నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు వేలాదిగా తరలివచ్చారు. రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ఉషశ్రీ చరణ్, ఏడీసీసీబీ చైర్‌పర్సన్ లిఖిత సంఘీభావం తెలిపారు.

ఓర్వలేకే టీడీపీ ఆరోపణలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక టీడీపీ నేతలు ఎల్లోమీడియాను అడ్డుపెట్టుకుని ఆరోపణలు చేస్తున్నారని మంత్రి ఉషశ్రీచరణ్, తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ధ్వజమెత్తారు. చాగల్లు ప్రాజెక్టు సమీపంలో మంత్రి ఉషశ్రీచరణ్ హాజరై పాదయాత్రకు సంఘీభావం తెలిపిన తర్వాత మీడియాతో మాట్లాడారు. చాగల్లు, ముచ్చుకోట, పెండేకల్లు ప్రాజెక్టులను నీటితో నింపిన జగనన్న ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం పెరిగిందన్నారు. సంక్షేమ పాలనకే వచ్చే ఎన్నికల్లోనూ ప్రజలు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. పెద్దారెడ్డి పాదయాత్రకు వస్తున్న జనంలో నాల్గో వంతు కూడా లోకేష్ పాదయాత్రలో కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే పెద్దారెడ్డి మాట్లాడుతూ 30 ఏళ్ల జేసీ సోదరులను నమ్మి ప్రజలు మోసపోయారన్నారు. జేసీ బ్రదర్స్ కక్షలు సృష్టించి గ్రామస్థాయి నాయకులను గుప్పిట్లో పెట్టుకున్నారన్నారు. విసుగెత్తిపోయిన వారి అనుచరులు గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆదరించారన్నారు. సీఎం జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి గడపకూ అందడంతో టీడీపీ నుంచి జేసీ వర్గీయులు వైఎస్సార్‌సీపీలోకి క్యూ కడుతున్నారన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాలకు జోనల్ ఇన్‌చార్జ్‌ల నియామకం



వై.ప్రణయ్‌కుమార్‌రెడ్డి



రమేష్‌గౌడ్



బోయ నరేంద్రబాబు



రిలాక్స్ నాగరాజు

అనంతపురం క్రైం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ అనుబంధ విభాగాలకు జోనల్ ఇన్‌చార్జ్‌లను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. జిల్లాకు చెందిన నలుగురికి జోనల్ ఇన్‌చార్జ్‌లు (చిత్తూరు, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లా, అన్నమయ్య జిల్లా)గా అవకాశం దక్కింది. యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్‌గా యల్లారెడ్డి ప్రణయ్‌కుమార్‌రెడ్డి (ఉరవకొండ), బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్‌గా రమేష్‌గౌడ్ (అనంతపురం అర్బన్), రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జ్‌గా బోయ నరేంద్రబాబు(అనంతపురం అర్బన్), సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌చార్జ్‌గా రిలాక్స్ నాగరాజు (అనంతపురం) నియమితులయ్యారు.

క్లుప్తంగా

సూక్ష్మ సేద్య పరికరాలు సద్వినియోగం చేసుకోండి



డ్రిప్‌ను పరిశీలిస్తున్న ఏపీఎంఐపీ పీడీ ఫిరోజ్‌ఖాన్

కళ్యాణదుర్గం: రాష్ట్ర ప్రభుత్వం రాయితీతో అందిస్తున్న బిందు, తుంపర సేద్యం పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు ఏపీఎంఐపీ పీడీ ఫిరోజ్‌ఖాన్ సూచించారు. కళ్యాణదుర్గం, శెట్టూరు మండలాల పరిధిలోని ముదిగల్లు, ఈస్ట్ కోడిపల్లి, వెంకటంపల్లి, ముద్దినాయనపల్లి, తిప్పారెడ్డపల్లి గ్రామాలలో సోమవారం ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో రైతులు నూతనంగా ఏర్పాటు చేసుకున్న బిందు, తుంపర సేద్యం పరికరాల పనితీరును పరిశీలించారు. ఫర్టిగేషన్ విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. అర్హత ఉన్న ప్రతి రైతుకూ రాయితీతో బిందు, తుంపర పరికరాలను అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఐఓ మల్లేశు, రైతులు పాల్గొన్నారు.

196 మొబైల్ ఫోన్ల రికవరీ



మొబైల్‌ఫోన్ అందిస్తున్న ఎస్పీ ఫక్కీరప్ప

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: చాట్‌బాట్ సేవల ద్వారా ఫిర్యాదు చేసిన వాటిలో సోమవారం 196 మొబైల్ ఫోన్లను జిల్లా పోలీసులు రికవరీ చేశారు. వీటిని సంబంధీకులకు ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప నేరుగా అందజేశారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాలకు చెందిన ఆరు ఫోన్లను కొరియర్ ద్వారా ఉచితంగా డోర్ డెలివరీ ద్వారా సంబంధీకులకు పంపనున్నట్లు ఈ సందర్భంగా ఎస్పీ తెలిపారు.

స్పందన పిటీషనర్లకు చట్ట పరిధిలో పరిష్కారం

స్పందన కార్యక్రమంలో వినతులు అందజేసిన వాటిని పరిశీలించి, చట్టపరిధిలో ఉన్నవాటికి పరిష్కారం చూపాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఎస్పీ ఫక్కీరప్ప ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 74 వినతులు అందాయి. ఎస్పీ స్వయంగా బాధితులతో మాట్లాడి, సమస్య తీవ్రత తెలుసుకున్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేంద్రుడు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

- ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ వార్షిక పరీక్షలు
- ఉమ్మడి జిల్లాలో 99 కేంద్రాలు
- ప్రతి గదిలోనూ సీసీ కెమెరాలు
- తొలిసారి సమస్యాత్మక సెంటర్లు లేకుండా పరీక్షలు



రాప్తాడు రూరల్: ఇంటర్ విద్యార్థుల వార్షిక పరీక్షల సందడి మొదలైంది. గత నెల 20 నుంచి ప్రారంభమైన ప్రాక్టికల్ పరీక్షలు మంగళవారంతో ముగియనున్నాయి. ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకూ థియరీ పరీక్షలు ఉంటాయి. జిల్లాలో తొలిసారి సమస్యాత్మక సెంటర్ అనేది లేకుండా పరీక్షలు నిర్వహిస్తుండడం గమనార్హం.

మొత్తం 63,090 విద్యార్థులు

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఈ సారి 63,090 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాయనున్నారు. ఇందులో అనంతపురం జిల్లాకు సంబంధించి 41,186 మంది, శ్రీసత్యసాయి జిల్లాకు సంబంధించి 21,904 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలోనూ అనంత జిల్లాలో 18,500 మంది ప్రథమ, 22,587 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఉండగా... శ్రీసత్యసాయి జిల్లాలో 9,307 మంది ప్రథమ, 12,597 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారు. అనంతపురం జిల్లాలో 60 కేంద్రాలు, శ్రీసత్యసాయి జిల్లాలో 39 కేంద్రాలను కేటాయించారు. రోజూ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ఈ నేపథ్యంలో ప్రశ్నపత్రాలు మంగళ, బుధవారాల్లో ఆయా జిల్లాలకు చేరుకున్నాయి.

నిఘా నీడలో పరీక్షలు

ఈ ఏడాది పరీక్షల నిర్వహణను అధికారులు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. తొలిసారి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఒక్కటంటే ఒక్కటి సమస్యాత్మక సెంటర్‌గా గుర్తించకుండా పటిష్ట నిఘా నీడలో పరీక్షల నిర్వహణకు సిద్ధమయ్యారు. ప్రతి కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్ట్‌మెంటల్ అధికారిని నియమించారు. దాదాపు 3 వేలమంది వరకు ఇన్విజిలేటర్లను నియమిస్తున్నారు. ప్రతి గదిలోనూ సీసీ కెమెరాలు అమరుస్తున్నారు. పరీక్ష కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్ సమక్షంలో ప్రశ్నపత్రం తెరిచే ప్రదేశంలోనూ సీసీ కెమెరా ఉండేలా చర్యలు తీసుకున్నారు. ప్రతి కేంద్రంలోనూ ఇబ్బందులు తలెత్తకుండా ఫర్నీచరు, తాగునీరు, వెలుతురు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

సెల్‌ఫోన్ ఫ్రీ జోన్లుగా పరీక్ష కేంద్రాలు

సెల్‌ఫోన్ ఫ్రీ జోన్లుగా పరీక్ష కేంద్రాలుండాలంటూ జిల్లా అధికారులకు ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు అందాయి. పరీక్ష కేంద్రంలో ఏ స్థాయి అధికారి అయినా సెల్‌ఫోన్‌ను దగ్గర ఉంచుకోరాదు. రాష్ట్ర స్థాయి అధికారుల పర్యవేక్షణ కోసం, సమాచారం తెలుసుకునేందుకు చీఫ్ సూపరింటెండెంట్లు మాత్రమే ప్రత్యేక కీప్యాడ్ ఫోన్లు వినియోగించేలా ఉత్తర్వులు ఇచ్చారు. వీటిని కూడా నేరుగా ఇంటర్ బోర్డునే సరఫరా చేస్తోంది. సిమ్‌కార్డులు సైతం బోర్డునే అందజేస్తోంది. బోర్డు పంపిన సెల్‌ఫోన్లు సీఎస్‌ల వద్ద తప్ప మరెవరివద్ద కనిపించకూడదు. ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను కూడా అనుమతించరు. ప్రతి కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. ఏఎన్‌ఎం స్థాయి వైద్యసిబ్బంది అందుబాటులో ఉంటారు.

సీఎం జగనన్నకు అండగా నిలవాలి

- వార్డు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లకు మంత్రి ఉషశ్రీచరణ్ సూచన



వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

తాడిపత్రి టౌన్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డికి తొలి ప్రాధాన్యత ఓటు వేయాలని సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లను మంత్రి ఉషశ్రీ చరణ్ అభ్యర్థించారు. తాడిపత్రిలోని సీబీ రోడ్డులో ఉన్న సచివాలయాల్లో సోమవారం ఉదయం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్యతో కలసి ఉద్యోగులు, వలంటీర్లతో మాట్లాడుతూ.. కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు ఫలాలను అందిస్తూ దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా గుర్తింపు తెచ్చుకున్న జగనన్నకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు సముచిత స్థానం వైఎస్సార్‌సీపీతోనే దక్కిందన్నారు. సమావేశంలో ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యంతం మంజుల, డీసీసీబీ చైర్‌పర్సన్ మానుకింద లిఖిత, మాజీ చైర్మన్ వీరాంజనేయులు, ఏపీ సీడ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కంచెం రామ్మోహన్‌రెడ్డి, వికలాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రంగనాథరెడ్డి, ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థి కో–ఆర్డినేటర్ చెన్నకేశవరెడ్డి, నాయకులు కేశవరెడ్డి, బాబయ్య రామశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కట్టు కథలు నమ్మకండి

- గుంటూరు జిల్లా వైఎస్సార్‌సీపీ యూత్ లీడర్ కల్లం హరికృష్ణారెడ్డి



రాప్తాడులోని టీడీపీ కార్యాలయం ఎదుట మీడియాతో మాట్లాడుతున్న హరికృష్ణారెడ్డి

రాప్తాడు: 'చేసింది.. చేసేది తప్పుడు పనులు. పైగా కప్పి పుచ్చుకునేందుకు తప్పుడు ప్రచారాలకు దిగడం టీడీపీ నాయకులకు అలవాటైపోయింది. దేవుడి మాన్యంలో ఎకరా విస్తీర్ణంలో టీడీపీ కార్యాలయాన్ని అడ్డగోలుగా నిర్మించారు. జాకీ ఫ్యాక్టరీ ఏర్పాటు నెపంతో రూ.50 కోట్ల లంచాన్ని యాజమాన్యంతో మాజీ మంత్రులు నారా లోకేష్, పరిటాల సునీత దండుకున్నారు. ఇవన్నీ వాస్తవం కాదా?' అంటూ గుంటూరు జిల్లా వైఎస్సార్‌సీపీ యూత్ లీడర్ కల్లం హరికృష్ణారెడ్డి ప్రశ్నించారు. సోషల్ మీడియాలో టీడీపీ కార్యకర్తలు చేసిన సవాల్‌ను స్వీకరించి సోమవారం అనంతపురానికి వచ్చిన ఆయన ఉదయం 8 గంటలకు నేరుగా రాప్తాడుకు చేరుకున్నారు. స్థానికంగా పండమేటి లక్ష్మీవేంకటరమణస్వామి మాన్యంలో నిర్మించిన టీడీపీ కార్యాలయంతో పాటు 44వ జాతీయ రహదారి పక్కన జాకీ ఫ్యాక్టరీ కోసం కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 44వ జాతీయ రహదారి పక్కనే ఎకరా భూమి రూ.5 కోట్లు విలువ చేస్తోందని, రూ.150 కోట్ల విలువైన 30 ఎకరాల భూమిని కేవలం రూ.3 కోట్లకే జాకీ కంపెనీ ఏర్పాటుకు అప్పట్లో చంద్రబాబు ప్రభుత్వం కేటాయించిందని గుర్తు చేశారు. ఇందుకు ప్రతిగా కంపెనీ యాజమాన్యంతో రూ.50 కోట్లను లంచంగా అప్పటి మంత్రులుగా ఉన్న నారా లోకేష్, పరిటాల సునీత దండుకున్నారని ఆరోపించారు. 2015లో కంపెనీకి కేటాయించిన స్థలంలో అధికారంలో ఉన్న నాలుగేళ్లలో ఒక్క పెల్ల కూడా టీడీపీ ప్రభుత్వం కట్టించలేకపోయిందన్నారు. పైగా వేధింపులకు గురి చేయడంతో కంపెనీ ఏర్పాటు నిర్ణయాన్ని యాజమాన్యం వెనక్కు తీసుకుందన్నారు. ఈ వాస్తవాన్ని కప్పిపుచ్చి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. కాగా, హరికృష్ణారెడ్డి రాప్తాడుకు రాగానే ఇటుకలపల్లి సీఐ మోహన్, ఎస్‌ఐలు ఆంజనేయులు, శ్రీకాంత్ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

- రూ.5.19 లక్షలు విలువైన బంగారు నగలు, సెల్‌ఫోన్లు స్వాధీనం



నిందితుడిని అరెస్టు చూపుతున్న రైల్వేపోలీసులు

గుంతకల్లు: రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఓ అంతర్ జిల్లా దొంగను అరెస్ట్ చేసినట్లు జీఆర్‌పీ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ తెలిపారు. స్థానిక రైల్వేస్టేషన్‌లోని తన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడి వివరాలను ఆయన వెల్లడించారు. దొంగలించిన సొత్తుతో ధర్మవరం నుంచి గుంతకల్లుకు రైలులో ఓ దొంగ ప్రయాణిస్తున్నాడనే ఆదివారం సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు అప్రమత్తమయ్యారు. దీంతో గుంతకల్లు రైల్వే స్టేషన్‌కు చేరుకుంటున్న పలు రైళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేయడం మొదలు పెట్టారు. పోలీసులను గమనించి ఓ యువకుడు పారిపోయేందుకు ప్రయత్నించడంతో అక్కడే ఉన్న జీఆర్‌పీ కానిస్టేబుల్ రమేష్ వెంటాడి పట్టుకున్నాడు. రూ.5,19,100 విలువ చేసే బంగారు నగలతో పాటు 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో యువకుడిని శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం వెంకటాంపల్లికి చెందిన సాకే ఉదయ్‌గా గుర్తించారు. జల్సాలకు అలవాటు పడిన ఉదయ్ ఇల్లు వదలి ప్రస్తుతం అనంతపురంలోని కలెక్టర్ కార్యాలయం వద్దకు మకాం మార్చాడు. సులువుగా డబ్బు సంపాదించేందుకు దొంగతనాలను మార్గంగా ఎంచుకున్నాడు. ఈ క్రమంలో ఈ ఏడాది జనవరి 27న యూపీ గ్యాంగ్‌తో కలసి గుంతకల్లు జంక్షన్‌లో బెంగుళూరు–న్యూఢిల్లీ వెళ్లే కర్ణాటక ఎక్స్‌ప్రెస్, యశ్వంత్‌పూర్–బీదర్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లలో చోరీలకు పాల్పడ్డాడు. ఉదయ్‌పై ఇప్పటికే గుంతకల్లు, ధర్మవరం, కర్నూలు జీఆర్‌పీ పరిధిలో ఏడు కేసులున్నాయి. నిందితుడి నుంచి సేకరించిన సమాచారం మేరకు త్వరలో యూపీ గ్యాంగ్‌ను అరెస్ట్ చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు జీఆర్‌పీ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ తెలిపారు. అంతేకాక నిందితుడి అరెస్ట్‌లో చొరవ చూపిన కానిస్టేబుల్ రమేష్‌ను అభినందిస్తూ జీఆర్‌పీ ఎస్పీ చౌడేశ్వరి మంజూరు చేసిన రివార్డ్‌ను డీఎస్పీ అందజేశారు. కార్యక్రమంలో గుంతకల్లు జీఆర్‌పీ సీఐ నగేష్‌బాబు, ఆర్‌పీఎఫ్ సీఐ రమేష్‌గౌడ్, ఇంటిలిజెన్స్ ఇన్‌స్పెక్టర్ బెనయ్య, ఎస్‌ఐలు మహేంద్ర, గోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ క్రీడాకారుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లాలోని క్రికెట్ క్రీడాకారులు రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలైంది. ఈ మేరకు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి మధు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2023–24 క్రీడా సంవత్సరానికి సంబంధించి అండర్–14, 15, 16, 19, 23, సీనియర్ విభాగాల్లోని క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు నకలు, స్టడీ సర్టిఫికెట్, ఫొటోలను ఈ నెల 15 నుంచి 30వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు అనంత క్రీడాగ్రామంలోని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యాలయంలో సమర్పించి పేర్లు నమోదు చేసుకోవాలి. ర్టిఫికెట్‌తో ఎంపికకు హాజరు కావాలని కోరారు.

రేపు క్రికెట్ జిల్లా జట్టు ఎంపిక

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లా అండర్–19 క్రికెట్ జట్టు ఎంపికను ఈ నెల 8న ఉదయం 9 గంటలకు అనంత క్రీడాగ్రామంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి మధు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఏసీఏ నిబంధనల మేరకు జరిగే ఈ ఎంపికకు హాజరయ్యే క్రీడాకారులు 2004, సెప్టెంబర్ 1 తర్వాత జన్మించి ఉండాలన్నారు. తప్పనిసరిగా క్రికెట్ కిట్, యూనిఫాం, జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్‌తో హాజరు కావాలి.

పోలింగ్‌కు సహకరించండి

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఈ నెల 13న జరగనుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. ఓటర్లందరూ తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవసరమైన సదుపాయాన్ని తమ ఉద్యోగులకు ప్రైవేటు యాజమాన్యాలు, వ్యాపార, పారిశ్రామిక సంస్థలు కల్పించాలని సూచించారు. పోలింగ్ ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుందన్నారు.

వర్క్‌బుక్స్ కరెక్షన్ చేయండి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ సాయిరాం

రాప్తాడు రూరల్: విద్యార్థులు రాస్తున్న వర్క్‌బుక్కులను విధిగా కరెక్షన్ చేయాలని ఉపాధ్యాయులను జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరాం ఆదేశించారు. సోమవారం అనంతపురం మూడో రోడ్డులోని శారద నగర పాలక బాలికల ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. వర్క్ బుక్స్ ఎప్పటికప్పుడు కరెక్షన్ చేసి తప్పులు గుర్తించి వెంటనే విద్యార్థులకు తెలియజేయాలి సూచించారు. అనంతరం నగరంలోని ఎస్సీ బాలుర హాస్టల్–4ను సాయంత్రం సందర్శించి పదో తరగతి విద్యార్థుల నోట్ బుక్కులు పరిశీలించారు. ఎనిమిదో తరగతి విద్యార్థుల బైజూస్ టాబ్స్ వినియోగాన్ని తనిఖీ చేశారు. డీఈఓ వెంట ఏఎంఓ హరికృష్ణ, ఏపీఓ నారాయణస్వామి ఉన్నారు.

పోలింగ్ బూత్‌లను పరిశీలించిన జేసీ



యల్లనూరు: జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న జేసీ కేతన్‌గార్గ్

యల్లనూరు/బుక్కరాయసముద్రం/నార్పల/పుట్లూరు: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో శింగనమల నియోజకవర్గంలోని యల్లనూరు, బుక్కరాయసముద్రం, నార్పల, పుట్లూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేయనున్న పోలింగ్ బూత్‌లను జేసీ కేతన్‌గార్గ్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక అధికారులు, ఉపాధ్యాయులతో ఆయన మాట్లాడారు. తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్తు, వికలాంగులకు అనువుగా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఏఏ మండలాల్లో ఎంతమంది ఓటర్లు ఉన్నారనే వివరాలను ఆరా తీశారు. పోలింగ్ రోజు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన వెంట యల్లనూరులో తహసీల్దారు రమాదేవి, ఇన్‌ఛార్జి ఎంపీడీఓ కొండన్న, ఎంఈఓ చంద్రశేఖర్, ఎస్‌ఐ రామకృష్ణ, తదితరులున్నారు. అలాగే బీకేఎస్‌లో తహసీల్దార్ మోహన్‌కుమార్, ఎంపీడీఓ తేజోత్స్న, ప్రధానోపాధ్యాయురాలు సుమంగళి, నార్పలలో తహసీల్దార్ నారాయణస్వామి, ఎంపీడీఓ దివాకర్ తదితరులు, పుట్లూరులో తహసీల్దార్ సుమతి, ఎంపీడీఓ యోగానందరెడ్డి, డీటీ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కీచక టీచర్‌కు దేహశుద్ధి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన శ్రీచైతన్య పాఠశాల ఉపాధ్యాయుడికి బాధితురాలి కుటుంబ సభ్యులు సోమవారం దేహశుద్ధి చేసి, పోలీసులకు అప్పగించారు. అనంతపురం పోలీసులు తెలిపిన మేరకు... స్థానిక టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని శ్రీచైతన్య స్కూల్‌లో ప్రైమరీ విద్యను బోధించే ప్రభంజన్ విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించేవాడు. సోమవారం పాఠశాల ప్రారంభ సమయంలో ఓ విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో బాధితురాలు సమీపంలోనే ఉండే ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు విషయం తెలిపింది. దీంతో వారు వెంటనే అక్కడికి చేరుకుని కీచక టీచర్‌కు దేహశుద్ధి చేశారు. అనంతరం టూటౌన్ పోలీసులకు అప్పగించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చిలక జోష్యం ఫలించేనా?



భవిష్యత్తు ఎలా ఉంటుందో తెలుసుకోవాలనే ఆత్రుత వైద్య విద్యార్థులను చిలక జోష్యం చెప్పించుకునేలా చేసింది. సరదా కోసమే అయినా... సోమవారం ఉదయం అనంతపురంలో కనిపించిన ఈ దృశ్యం పలువురిని ఆకర్షించింది. కంప్యూటర్ యుగంలో చిలక జోష్యం ఫలిస్తుందా? అంటూ ఈ సందర్భంగా కొందరు వ్యాఖ్యానించారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

ఎనిమిది మందికి గాయాలు

బత్తలపల్లి: ఆటో బోల్తాపడిన ఘటనలో ఎనిమిది మంది గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... రాప్తాడు మండలం గొందిరెడ్డిపల్లికి చెందిన దాదాపు పది మందికి పైగా సోమవారం రాత్రి ఆటోలో ముదిగుబ్బ మండలం సంకేపల్లి సమీపంలోని వీరనారాయణస్వామి మారుపూజకు బయలుదేరారు. బత్తలపల్లి మండలం కట్టకిందపల్లి సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాల లైటింగ్‌కు ఆటో డ్రైవర్ కళ్లు కనిపించక నిర్మాణంలో రోడ్డులోకి దూసుకెళ్లడంతో అదుపు తప్పి బోల్తాపడింది. మునలక్క, నాగరాజు, యల్లమ్మ, మల్లన్న, అశ్వని, అశ్వత్థమ్మ, అక్కమ్మ, షణ్ముఖ గాయపడ్డారు. క్షతగాత్రులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

రూ.కోటి కొట్టేశాడు!



బ్యాంక్ ఎదుట ధర్నా చేస్తున్న పొదుపు సంఘాల మహిళలు

- యూబీఐ బిజినెస్ కరస్పాండెంట్ ఘరానా మోసం
- పొదుపు సంఘాల మహిళల డిపాజిట్ నగదు స్వాహా
- న్యాయం చేయాలంటూ బ్యాంక్ ఎదుట బాధిత మహిళల ధర్నా

ధర్మవరం: బ్యాంకుకు...గ్రామీణ ప్రాంత ఖాతాదారులకు వారధిగా ఉండాల్సిన బిజినెస్ కరస్పాండెంట్ (బీసీ) పొదుపు మహిళలకు టోకరా వేశాడు. రుణ వాయిదా కోసం పొదుపు మహిళలు చెల్లించిన మొత్తాన్ని బ్యాంకు ఖాతాలకు జమ చేయకుండా స్వాహా చేశాడు. మొత్తంగా రూ.కోటి కొట్టేశాడు. నకిలీ రసీదులిచ్చి, బ్యాంక్ పాసు పుస్తకాలపైన ఫోర్జరీ సంతకాలు చేసి మరీ దందా నడిపాడు. చివరకు మహిళా సంఘాలకు సంబంధించి మొండి బకాయిల జాబితా సిద్ధం కావడంతో బ్యాంక్ ఉన్నతాధికారులు రంగంలో దిగారు. దీంతో బీసీ బండారం బట్టబయలైంది. మోసపోయిన విషయం గుర్తించిన మహిళలు ధర్మవరంలోని యూనియన్ బ్యాంక్ ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు.

ఐదేళ్లుగా విధులు

ధర్మవరంలోని యూనియన్ బ్యాంక్ శాఖకు రేగాటిపల్లిలో బీసీ శివారెడ్డి ఐదేళ్లుగా బిజినెస్ కరస్పాండెంట్‌గా వ్యవహరిస్తున్నాడు. స్థానికుల నుంచి డిపాజిట్లు, రుణాలకు సంబంధించిన వాయిదా సొమ్ము సేకరించి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుండేవాడు. ఇందుకు సంబంధించి ప్రతి నెలా రసీదులిచ్చేవాడు. ఈ క్రమంలో తనపై నమ్మకం కుదిరిన తర్వాత ఈజీ మనీ కోసం పక్కా స్కెచ్ వేశాడు. గ్రామంలోని 26 పొదుపు సంఘాల సభ్యులు 260 మంది ప్రతి నెలా చెల్లించే రుణ కంతుల మొత్తం స్వీకరించి నకిలీ రసీదులు ఇచ్చి, ఆ మొత్తాన్ని తన అవసరాలకు వాడుకోవడం మొదలు పెట్టాడు. ఈ క్రమంలో బ్యాంక్ పాసుపుస్తకాల్లోనూ అధికారుల సంతకాలను ఫోర్జరీ చేస్తూ బోగస్ ఎంట్రీలు చేసేవాడు. ఈ క్రమంలో రుణాలు చెల్లించకపోవడంతో ఒక్కో పొదుపు సంఘం రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు బకాయి పడింది. ఈ మొత్తం అక్రమాల్లో అప్పట్లో పనిచేసిన బ్యాంక్ సిబ్బంది శివారెడ్డికి పూర్తిగా సహకరించినట్లు తెలుస్తోంది.

విచారణలో బండారం బట్టబయలు

ఇటీవల యూనియన్ బ్యాంక్ ఉన్నతాధికారులు రేగాటిపల్లిలోని పొదుపు సంఘాలు చాలా వరకు మొండి బకాయిల జాబితాలో ఉండడం గమనించారు. దీంతో వారు నేరుగా గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. ఈ విచారణలో బిజినెస్ కరస్పాండెంట్ శివారెడ్డి పొదుపు సంఘాల నుంచి వసూలు చేసిన డబ్బులు బ్యాంక్‌కు చెల్లించడం లేదని తేలింది. మొత్తం రూ.కోటి వరకూ స్వాహా చేసినట్లు గుర్తించారు. ఈ విషయం తెలుసుకున్న మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ సోమవారం ఉదయం ధర్మవరానికి చేరుకుని యూనియన్ బ్యాంక్ ఎదుట సాయంత్రం వరకూ ధర్నా నిర్వహించారు. తమకు న్యాయం చేయాలంటూ డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

నేడు ప్రజాప్రతినిధులతో సమావేశం

ఆత్మకూరు: మండలంలోని అన్ని రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులతో మంగళవారం సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయ్ ప్రసాద్ సోమవారం తెలిపారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలోని ఆత్మకూరు-1 ఎంపీటీసీ స్థానానికి త్వరలో ఉప ఎన్నిక జరగనున్న నేపథ్యంలో డ్రాఫ్ట్ పోలింగ్ స్టేషన్ల జాబితా తయారు చేసి ప్రచురించినట్లు తెలిపారు. ఏవైనా అభ్యంతరాలు, సలహాలు,సూచనలు తెలియజేయడానికి సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని ఎంపీడీఓ తెలిపారు.

13న ఆస్పత్రిలో ఫ్లారెన్స్ నైటింగేల్ విగ్రహం ఏర్పాటు

అనంతపురం సప్తగిరి సర్కిల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఈ నెల 13న ఫ్లారెన్స్ నైటింగేల్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నర్సింగ్ సూపరింటెండెంట్ మంజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. విగ్రహ ఏర్పాటుకు కలెక్టర్, ఇతర శాఖల అధికారుల అనుమతి లభించినట్లు తెలిపారు. కార్యక్రమానికి జిల్లాలోని ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు.

మహిళల రక్షణకు పెద్దపీట



మాట్లాడుతున్న ఏఎన్ఎం గొల్ల అనిత

రాప్తాడు: ప్రభుత్వం మహిళల రక్షణకు పెద్ద పీట వేసిందని ఏఎన్ఎం గొల్ల అనిత, మహిళా సంరక్షణ కార్యదర్శి రాజేశ్వరి తెలిపారు. సోమవారం పంగల్ రోడ్డు సమీపంలోని టీటీడీసీలో మహిళా దినోత్సవం పురస్కరించుకొని బాల్యవివాహాలు, బాలికలను రక్షించు – బాలికలను చదివించు, దిశా యాప్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీటీడీసీ ట్రైనర్ రాణి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

డ్రాపౌట్స్‌పై దృష్టి సారించాలి

అనంతపురం క్రైం: డ్రాపౌట్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కమిషనర్ రమణారెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం నగరంలోని పాతూరు ఆశా స్కూల్‌లో అదనపు కమిషనర్ పర్యటించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఆయన రుచి చూసి, సంతృప్తిచెందారు. అనంతరం మరుగుదొడ్లను పరిశీలించారు. విద్యార్థులతో ప్రభుత్వం అందించిన షూ, స్కూల్ బ్యాగ్స్‌ను వినియోగిస్తున్నారా లేదానని ఆరా తీశారు. అనంతరం ఆయన అహుడా కార్యాలయంలోని అధికారులు, సిబ్బంది, స్కూళ్లలోని ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటును వినియోగంపై సూచనలు చేశారు.

రోడ్డుకిరువైపులా హోటళ్లను తొలగించండి



హోటళ్లను తొలగించాలని తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

రాప్తాడు: లక్ష్మీ పండమేటి వెంకటరమణ స్వామి ఆలయ భూమి 44వ జాతీయ రహదారిపై రోడ్డుకు ఇరువైపులా హోటళ్లు, దుకాణాలను తొలగించాలని లక్ష్మీ పండమేటి వెంకటరమణ స్వామి ఆలయ ప్రెసిడెంట్ గంజి రాముడు, ఆలయ కమిటీ సభ్యులు కోరారు. సోమవారం ఆలయ కమిటీ సభ్యులు స్పందన కార్యక్రమంలో వినతిపత్రం అందించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గంజి రాముడు మాట్లాడుతూ కొత్త రోడ్డుపై వేస్తున్న షాపులను అడ్డుకుని, 44వ జాతీయ రహదారిపై వేసుకున్న షాపులను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నారాయణ, ముత్యాల వెంకటరాముడు, మారుతి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'పింక్ వరల్డ్'



ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటీషన్‌లో ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణలు

రాప్తాడురూరల్: స్థానిక రామ్‌నగర్‌లోని క్రీసెంట్ స్కూల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన 'పింక్ వరల్డ్' డే ఆకట్టుకుంది. చిన్నారుల కళా ప్రదర్శనలు సాంస్కృతిక సంబరాలు, విద్యార్థుల తల్లులకు ఆటల పోటీలు జరిగాయి. విద్యాసంస్థల కరస్పాండెంట్ కేఎం షఫీ ఉల్లా, వైస్ చైర్మన్ షమీం, ఆత్మీయ అతిథిగా హాజరైన ఐద్వా కార్యదర్శి సావిత్రి తదితరులు ఎగ్జిబిషన్ తిలకించి చిన్నారుల ప్రతిభ పాటవాలను కొనియాడారు. వ్యాస మంజరి పుస్తకాన్ని పండిట్ రియాజుద్దీన్ అహ్మద్ ఆవిష్కరించారు. హెచ్ఎం వెంకటేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొదటి ప్రాధాన్యత ఓటు వేయండి

- ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులకు ఎమ్మెల్యే 'అనంత' విజ్ఞప్తి



ఇరిగేషన్ కార్యాలయంలో ఉద్యోగులకు ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అనంత



బీసీ కార్పొరేషన్‌లో ప్రచారం చేస్తున్న బీసీ డైరెక్టర్లు

అనంతపురం క్రైం: పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ఉన్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులను కోరారు. సోమవారం నగరంలోని ఇరిగేషన్, పవర్ ఆఫీస్, ఐసీడీఎస్, పెన్నార్ భవన్, ఎస్పీడీసీఎల్, పంచాయితీరాజ్ శాఖ, ఆర్డీఓ, డీఆర్‌డీఏ, డ్వామా, గృహ నిర్మాణశాఖ, అటవీశాఖ, డీపీఆర్ఓ, వ్యవసాయ, ఉద్యాన శాఖ, భూసారపరీక్ష కేంద్రం, క్రిమి సంహారక పరీక్ష కేంద్రం కార్యాలయం, తదితర ప్రభుత్వ కార్యాలయాల్లోని ఎమ్మెల్యే ప్రచారం చేశారు. పట్టభద్రుల బ్యాలెట్‌లో మూడో సంఖ్యలో ఉన్న అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, 11వ సంఖ్యలో ఉన్న అభ్యర్థి రామచంద్రారెడ్డికి ఓటు వేయాలని కోరారు.

యువతకు ఉపాధి కల్పనే ధ్యేయం..

యువతకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పించడమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రానికి రూ.13.41 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవడం ఆషామాషీ విషయం కాదని ఎమ్మెల్యే అనంత అన్నారు. ఇది రాష్ట్రానికే శుభపరిణామమన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో లక్షలాది మందికి ఉపాధి కలుగుతుందన్నారు. విశాఖలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో పెట్టుబడులకు సంబంధించి 378 ఎంఓయులు కుదుర్చుకున్న విషయాన్ని గుర్తు చేశారు. గతంలోనే సచివాలయ వ్యవస్థ, వైద్య రంగం, పోలీసు తదితర శాఖల్లో ఉపాధి అవకాశాలను ఊహకందనంతగా మెరుగుపర్చారన్నారు. నిరుద్యోగులకు బాసటగా నిలుస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికి విద్యావంతులు అండగా నిలవాలన్నారు. మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, అనుబంధ సంఘాల అధ్యక్షులు సైపుల్లాబేగ్, కొర్రపాడు హుస్సేన్ పీరా, శ్రీదేవి, పార్టీ నగర అధ్యక్షుడు సోమశేఖర్ రెడ్డి, అధ్యక్షురాలు కృష్ణవేణి, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ గౌస్‌బేగ్, వైఎస్సార్ సీపీ నేత రమేష్‌గౌడ్, అనిల్‌కుమార్‌గౌడ్, కార్పొరేటర్లు ముంతాజ్, సాకే చంద్రలేఖ, లీలావతి, లావణ్య, అనిల్‌కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మర ప్రచారం..

నగరంలోని 50 డివిజన్లలోని కార్పొరేటర్లు ఓటర్లను కలిశారు. తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. బీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు శ్రీనివాసులు (నాయీబ్రాహ్మణ), అల్లీపీర (దూదేకుల), రాఘవేంద్ర (మేదర), లక్ష్మీనాగేంద్ర (ఆర్‌ఏ కటిక), అన్నపూర్ణ నవీన్‌కుమార్ (సగర ఉప్పర)లు బీసీ కార్పొరేషన్, బీసీ వెల్ఫేర్ కార్యాలయాల్లో ప్రచారం చేశారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, క్లస్టర్ ఇన్‌చార్జ్ కొండ్రెడ్డి ప్రకాష్ రెడ్డి మారుతీనగర్‌లో ప్రచారం చేశారు. వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ ఆధ్వర్యంలో నగరంలోని 5వ డివిజన్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జయలలిత, నాయకులు పవన్ కుమార్‌రెడ్డి, రాజకుల్లాయప్ప, మనీ, భరత్, సచివాలయ కన్వీనర్ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు: వెన్నపూసరవీంద్రారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆది ఓటర్లను కోరారు. సోమవారం వారు స్థానిక నాయకులతో కలిసి రాప్తాడులో ప్రచారం చేశారు. వారు మాట్లాడుతూ పట్టభద్రుల స్థానం నుంచి వెన్నపూస రవీంద్రా రెడ్డి, ఉపాధ్యాయుల స్థానం నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థిగా రామచంద్రారెడ్డికి మద్దతిచ్చి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మరూరు సొసైటీ అధ్యక్షుడు మాచిరెడ్డి కొండా రెడ్డి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పసుపుల నరసింహ గౌడ్, చాపట్ల నరసింహులు, మన్నల రవికుమార్, మనోహర్ రెడ్డి, నారపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఓటు వేద్దాం..

ఆత్మకూరు: ప్రస్తుతం జరగబోవు ఎన్నికల్లో అభివృద్ధిని చూసి ఎమ్మెల్సీ అభ్యర్థులకు ఓటు వేద్దామని వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. సోమవారం మండలంలోని గొరిదిండ్ల, గొరిదిండ్ల తండా, ముట్టాల, పాపంపల్లి గ్రామాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారన్నారు. ఇప్పటి వరకు ఇచ్చిన హామీల్లో 98 శాతం అమలు చేశారన్నారు. పట్టభద్రులు ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి, పార్వతమ్మ, నరసింహారెడ్డి, బాలపోతన్న, అతికిరెడ్డి, అంజినప్ప, గోపాల్‌రెడ్డి, పోతన్న, విజయ్, ఓబీటైలర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడురూరల్: ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతుగా అనంతపురం రూరల్ మండలం కురుగుంటలో సోమవారం ప్రచారం చేశారు. ఉప సర్పంచ్ మాధవరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కిరణ్‌కుమార్‌రెడ్డి, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు ముస్తఫా, స్టోర్ డీలరు రఫీ తదితరులు సచివాలయం, పీహెచ్‌సీ తదితర చోట్ల ప్రచారం చేశారు.

కనుల పండువగా కల్యాణోత్సవం

ఆత్మకూరు: పంపనూరు కొండపై వెలసిన మలోబిల లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణోత్సవం సోమవారం కనులపండువగా జరిగింది. స్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా పట్టు వస్త్రాలతో, బంగారు ఆభరణాలతో అలంకరించి, వేదపండితుల మంత్రోచ్చారణలతో కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. మంగళవారం రథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ నరసింహారెడ్డి తెలిపారు.

9న ఆర్టీసీ కార్గోలో వేలం

అనంతపురం సెంట్రల్: నగరంలో ఆర్టీసీ డిపోలోని కార్గో కార్యాలయంలో ఈనెల 9న ఉదయం 10 గంటలకు వేలం నిర్వహిస్తున్నట్లు కార్గో కమర్షియల్ ఏటీఎం అమర్‌నాథ్ ఓ ప్రకటనలో తెలిపారు. రీజియన్ పరిధిలోని 13 డిపోల పరిధిలో వినియోగదారులు తీసుకెళ్లకుండా మిగిలిపోయిన 50 రకాల వస్తువులను బహిరంగ వేలం వేయనున్నట్లు తెలిపారు.

చేతనను అభినందించిన సీఎం జగన్



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న చేతన, చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ దంపతులు

అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ కుమార్తె చేతనను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందించారు. సోమవారం విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో కుమార్తె చేతనతో కలసి బోయ గిరిజమ్మ దంపతులు సీఎం జగన్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. 'జయహో జగనన్న.. ఇప్పుడైనా.. ఇంకెప్పుడైనా మన ఆంధ్రా సీఎం జగనన్న' అంటూ బోయ గిరిజమ్మ కుమార్తె చేతన పాడిన పాట విశేష ప్రజాదరణ పొందుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తమ బిడ్డతో కలసి గిరిజమ్మ దంపతులు సీఎం జగన్‌ను కలిశారు. పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. తమ బిడ్డ పాడిన పాటను వినిపించారు. చేతన పాడిన పాట విని జగన్ 'చాలా చక్కగా పాడావు చిట్టి తల్లీ' అంటూ ప్రశంసించారు.

'రఘు సైనిక్' విద్యార్థుల ప్రతిభ



రాప్తాడురూరల్: కిట్టూరు రాణి చెన్నమ్మ బాలికల సైనిక్ స్కూల్ ప్రవేశానికి ఈ ఏడాది జనవరిలో జరిగిన రాత పరీక్షలో నగరంలోని రఘు సైనిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. 60 మంది విద్యార్థినులు పరీక్షకు హాజరు కాగా, 57 మంది అర్హత సాధించారని స్కూల్ డైరెక్టర్లు రాఘవేంద్ర, గురుప్రసాద్, లోకేష్ తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి





ఆచార్య లక్ష్మిని సన్మానిస్తున్న జేఎన్‌టీయూ ఉద్యోగులు, మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి

అనంతపురం సప్తగిరి సర్కిల్: మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి ఆకాంక్షించారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, ఇన్నర్‌వీల్ క్లబ్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ప్రభుత్వ డాక్టర్స్ అసోసియేషన్, పల్స్ జిమ్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ప్రత్యేకంగా వైద్య శిబిరాన్ని, వారికి క్రీడా పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. ఫోరెన్సిక్ విభాగం సెమినార్ హాల్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ షారోన్ సోనియా, వైద్యులు ప్రసూన హాజరయ్యారు. అనంతరం వైద్యులు, ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లకు స్కిప్పింగ్, త్రో బాల్, వాలీబాల్, లెమన్ అండ్ స్పూన్, టగ్ ఆఫ్ వార్, బకెట్ బాల్ క్రీడా పోటీలు నిర్వహించారు. క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ కార్యదర్శి ప్రతిమ, పద్మా, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మహిళ విభాగం అధ్యక్షురాలు సుమన గోపిచంద్, వైద్యురాలు శైలజ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పరదేశినాయుడు, మెడికల్ కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో భాగస్వామ్యం శుభపరిణామం

అనంతపురం సిటీ: అన్ని రంగాల్లోనూ మహిళల భాగస్వామ్యం పెరగడం శుభ పరిణామమని జేఎన్‌టీయూఏ వీసీ రంగ జనార్దన పేర్కొన్నారు. సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జేఎన్‌టీయూలోని వేర్వేరు విభాగాల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉమెన్ ఎంపవర్‌మెంట్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి వీసీ రంగజనార్దన ఆన్‌లైన్‌లో తన సందేశం ఇచ్చారు. ఆచార్య శశిధర్, ఆచార్య లక్ష్మీ మాట్లాడారు. అనంతరం వివిధ రకాల ఆటల పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థినులు, మహిళా ఉద్యోగులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి ఆచార్య భువన విజయ అధ్యక్షత వహించగా, డైరెక్టర్లు ఆచార్య సుమలత, కిరణ్మయి, పద్మ సువర్ణ, కేశవరెడ్డి, సుబ్బారెడ్డి, సురేశ్‌బాబు, దుర్గా ప్రసాద్, ప్రిన్సిపాల్ సుజాత, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. జేఎన్‌టీయూలోని ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ప్రిన్సిపాల్ ఆచార్య సుజాత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డాక్టర్ ఎల్‌టీ శారద, స్టూడెంట్ కోఆర్డినేటర్ ఎంఎస్ జాహ్నవి, డైరెక్టర్ ఆచార్య కేశవరెడ్డి, కళాశాల విభాగాధిపతులు విశాలి, విష్ణువర్ధన్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలపై భారం మోపుతున్న మోదీ

- మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి పద్మావతి



సిలిండర్లను మోస్తూ నిరసన తెలుపుతున్న మహిళ సమాఖ్య నాయకురాళ్లు

అనంతపురం అర్బన్: మోదీ ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజలపై భారం మోపుతోందని మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మావతి విమర్శించారు. పెంచిన వంటగ్యాస్ ధరలు తగ్గించాలని సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పార్వతీప్రసాద్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. గ్యాస్ సిలిండర్‌ని మోస్తూ పద్మావతి నిరసన తెలిపారు. ఆమె మాట్లాడుతూ వంటగ్యాస్ ధరలు పెంచడం ప్రజావ్యతిరేక చర్య అన్నారు. వంటగ్యాస్‌పై సబ్సిడీకి మోదీ ప్రభుత్వం మంగళం పాడిందన్నారు. సిలిండర్ ధర ఏకంగా రూ.1,172కు పెంచడం పేద, మధ్యతర గతి వర్గాలపై భారం మోపడమే అన్నారు. గ్యాస్ ధర పెంచుకుంటూ పోతే పేదలు మళ్లీ కట్టెల పొయ్యి వాడాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు. అనంతరం సూపరింటెండెంట్ తిరుమలరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కోశాధికారి రామాంజనమ్మ, నాయకురాళ్లు కుర్షిదా, యశోదమ్మ, నాగమ్మ, ముత్యాలమ్మ, శారదా, రమాదేవి, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం



చిత్రా నారాయణ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రాప్తాడు: కష్టాలు వచ్చినప్పుడే ధైర్యంగా ఉండాలని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. హంపాపురానికి చెందిన చిత్రా నారాయణ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అనంతపురం ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీలో ఉంచిన చిత్రా నారాయణ మృతదేహాన్ని ఆయన సందర్శించారు. తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఇంటి పెద్ద దిక్కు కోల్పోయామని బాధపడొద్దని.. ఎల్లవేళలా మేము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, నాయకులు సింగారప్ప, వెంకటనారాయణ, రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

ఆత్మకూరు: పంపనూరు గ్రామ సచివాలయ పరిధిలోని సింగంపల్లిలో హరిజన్న పోలన్న అనారోగ్యంతో మృతిచెందాడు. వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలు అతని కుటుంబ సభ్యులకు వైఎస్సార్‌సీపీ నాయకులు అందించారు.

సెన్సార్ టెస్ట్ డ్రైవ్‌పై అవగాహన కల్పించాలి

అనంతపురం అర్బన్: సెన్సార్ టెస్ట్ డ్రైవ్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆర్టీఓ సురేశ్‌నాయుడుకు ఏఐటీయూసీ, అనంతపురం ఆటో డ్రైవర్ల సంఘం నాయకులు విన్నవించారు. సోమవారం ఆయన చాంబర్‌లో ఏఐటీయూసీ జిల్లా ఉపప్రధాన కార్యదర్శి మల్లికార్జున, నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్ టెస్ట్ కోసం సెన్సార్ ట్రాక్ ఏర్పాటు చేశారన్నారు. ఈ ట్రాక్‌పై టెస్ట్ డ్రైవ్ చేసిన వారిలో 80 శాతం మంది ఫెయిల్ అవుతున్నారన్నారన్నారు. పలుసార్లు రీ టెస్ట్‌కు కట్టుకొని డ్రైవ్ చేసినా ఫెయిల్ అవుతూనే ఉన్నారన్నారు. ఫీజు చెల్లించికూడా లైసెన్స్ రాకపోవడంతో డ్రైవర్లు ఇబ్బంది పడుతున్నారన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని సెన్సార్ టెస్ట్ డ్రైవ్‌పై అవగాహన కల్పించాలన్నారు. అదే క్రమంలో టెస్ట్ డ్రైవ్‌లో కష్టతరమైన సిగ్నల్స్‌ను మినహాయించి, డ్రైవర్లకు లైసెన్స్ మంజూరయ్యేలా చూడాలని కోరారు. ఆటో డ్రైవర్ల సంఘం ప్రధాన కార్యదర్శి రాజు, నాయకులు రమేష్, కృష్ణనాయక్, నాగేంద్ర, పాల్గొన్నారు.

విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

- జేఎన్‌టీయూఏ వీసీ రంగ జనార్దన్
- ముగిసిన జేఎన్‌టీయూఏ అంతర కళాశాలల గేమ్స్‌మీట్



క్రీడాకారులతో జేఎన్‌టీయూఏ వీసీ రంగ జనార్దన్

గూడూరు రూరల్: విద్యతోపాటు క్రీడల్లోనూ రాణిస్తే తమలోని నైపుణ్యాన్ని మరింత మెరుగుపర్చుకోవచ్చని జేఎన్‌టీయూ అనంతపురం వీసీ రంగ జనార్దన్ పేర్కొన్నారు. గూడూరు సమీపంలోని ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో మూడు రోజులుగా జరిగిన యూనివర్సిటీ 11వ అంతర కళాశాలల గేమ్స్‌మీట్ సోమవారం అట్టహాసంగా ముగిసింది. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి వీసీ రంగజనార్దన్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ఈ గేమ్స్ మీట్‌లో 48 కళాశాలలకు చెందిన 1,747 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో తిరుపతి జిల్లా విద్యానగర్‌కు చెందిన ఎన్‌బీకేఆర్ కళాశాల ఓవరాల్ చాంపియన్‌గా నిలిచినట్లు తెలిపారు. 1,155 మంది బాలురు, 592 మంది బాలికలు క్రీడాపోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఏ మోహన్ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సమానంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరి బీ.జోజిరెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ ధనుంజయ, వేణుమాధవ్, ఏఓ రామయ్య, పీడీ రవిచంద్ర పాల్గొన్నారు.

విజేతలు వీరే..: బాలుర విభాగంలో వాలీబాల్ పోటీల్లో సిద్ధార్థ కళాశాల (పుత్తూరు), బాస్కెట్‌లో బాల్‌లో మిట్స్ కళాశాల (మదనపల్లి), బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో ఆదిశంకర (గూడూరు), డబుల్స్, టేబుల్ టెన్నిస్ సింగిల్స్‌లో ఎన్‌బీకేఆర్ (విద్యానగర్). టేబుల్ టెన్నిస్ డబుల్స్‌లో జేఎన్‌టీయూ అనంతపురం విజేతగా నిలిచాయి. కబడ్డీలో గీతాంజలి (నెల్లూరు) విన్నర్‌గా, ఎస్వీ కాలేజీ (తిరుపతి) రన్నర్స్‌గా గెలిచాయి. బాల్ బ్యాడ్మింటన్‌లో ఎన్‌బీకేఆర్ (విద్యానగర్), హ్యాండ్ బాల్ పోటీల్లో వేము ఐటీ(చిత్తూరు) విన్నర్‌గా నిలిచాయి.

బాలికల విభాగంలో..:

వాలీబాల్ పోటీల్లో ఎస్వీ కాలేజ్ (తిరుపతి), బాస్కెట్‌బాల్‌లో ఆర్‌జీఎం (నంద్యాల), బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో అన్నమాచార్య (తిరుపతి), డబుల్స్‌లో అన్నమాచార్య (తిరుపతి), టేబుల్ టెన్నిస్ సింగిల్స్‌లో నారాయణ (నెల్లూరు), డబుల్స్‌లో జేఎన్‌టీయూ (అనంతపురం), త్రోబాల్‌లో జేఎన్‌టీయూ (పులివెందుల), టెన్నికాయిట్ సింగిల్స్, డబుల్స్‌లో మిట్స్ (మదనపల్లి), బాల్ బ్యాడ్మింటన్‌లో ఎన్‌బీకేఆర్ (విద్యానగర్) విన్నర్స్‌గా నిలిచాయి.

జోరుగా ఎన్నికల ప్రచారం

కనగానపల్లి: గ్రామాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డి తరఫున సోమవారం పార్టీ నాయకులు గ్రామాల్లో ప్రచారం చేశారు. అభ్యర్థి రవీంద్రారెడ్డి భార్య హరితతో కలిసి ప్రజాప్రతినిధులు, నాయకులు ముక్తాపురం, మామిళ్లపల్లి, దాదులూరు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మారుతీప్రసాద్, వైఎస్సాసీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, డైరక్టర్ ప్రభాకర్, నాయకులు నాగముని, గంగుల సుధీర్‌రెడ్డి, రమణారెడ్డి, పాపన్న, వెంకటనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: ఈ నెల 1న జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించుకుందామని ఎంపీపీ అంజలి, జెడ్పీటీసీ గోవిందరెడ్డి ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీందారెడ్డి సతీమణి హరిత కోరారు. సోమవారం మండలంలోని ప్యాదిండి, నాగసముద్రం, బసినేపల్లి, చెన్నేకొత్తపల్లి గ్రామాల్లో ప్రచారం చేశారు.

కొనసాగుతున్న పోలీసు పికెటింగ్

గుత్తి: పట్టణంలోని జంగాల కాలనీలో మూడో రోజూ కూడా పోలీసు పికెటింగ్ కొనసాగింది. గత శనివారం సాయంత్రం బుడగ జంగం, బాల సంతుకుల ధ్రువీకరణ విషయంపై విచారణ చేయడానికి తహసీల్దార్ మహబూబ్ బాషా వెళ్లిన సమయంలో కాలనీకి చెందిన ఇరువర్గాలు ఘర్షణకు దిగారు. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా.. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి.

హోలీ..ఆనందాల కేళి!

- నేడు హోలీ పర్వదినం

అనంతపురం కల్చరల్: హోలీ అంటే అగ్ని లేదా అగ్నితో పునీతమైనది అని అర్థం. హోలీని 'హోళికా పూర్ణిమ'గా కూడా పిలుస్తారు. కులమతాలకతీతంగా స్నేహ భావనను పెంపొందించే వసంతోత్సవం (హోలీ) అంటే ఏ వయసువారైనా ఎంతో ఇష్టపడతారు. ఏటా ఫాల్గుణ మాసంలో పౌర్ణమి రోజున వచ్చే ఈ పండుగను హోలీ, కాముని పున్నమి అని కూడా అంటారు. మనిషి జీవితం రంగులమయంలా ఉండాలని, పౌర్ణమి నాటి చంద్రుడిలా నిండుగా వెలుగొందాలని.. ఆ రోజున రంగుల్లో తేలియాడుతారు. హోలీ పండుగ వెనుక 'హోళిక' త్యాగం దాగుందని పురాణాలు చెప్తున్నాయి. మనిషిలోని కోరికలను చంపేసుకోవడం అన్న భావనలో కామదహనం పేరిట కట్టెలపై పాత దుస్తులు, పడేసిన వస్తువులను దహనం చేసే సంప్రదాయం జిల్లాలో కొన్ని చోట్ల ఉంది. అయితే తిథుల్లో వస్తున్న మార్పుల వల్ల ఇస్కాన్‌లో మంగళవారం వేడుకలు జరుగుతుంటే..తిథి ఉన్న కారణంగా బుధవారం కూడా కొన్ని చోట్ల హోలీ జరుతుండడం విశేషం. నగరంలో దశాబ్దాల కిందటే గుజరాత్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ వంటి ఉత్తరభారత రాష్ట్రాల నుంచి ఎంతో మంది నగరానికి వచ్చి స్థిరపడ్డారు. వారికెంతో ఇష్టమైన హోలీ పండుగను రెండు, మూడు రోజుల పాటు సందడిగా జరుపుకుంటారు. ప్రత్యేకంగా కమలానగర్, పాతూరు, శ్రీనివాస నగర్ తదితర చోట్ల వారు హోలీ సంబరంగా చేసుకుంటున్నారు. భక్తి చైతన్యానికి నిదర్శనమైన చైతన్య మహాప్రభు జన్మదిన వేడుకలు, సత్యదేవుడి వ్రతాలు కూడా నేడు పెద్ద ఎత్తున జరుగనున్నాయి. ఈసారి ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న వేళ హోలీ పండుగ రావడంతో రంగులకు మరింత గిరాకీ పెరిగింది. వివిధ పార్టీల నుంచి బరిలో ఉన్న అభ్యర్థులు వారు, నామినేషన్లు వేస్తున్న సమయంలో రంగులు పులుముకుంటూ ఇప్పటికే సందడి చేశారు.

అతిగా రసాయనాలు వాడొద్దు

రంగు రంగుల్లో తడిసి ముద్దవుతూ ఆనంద సాగరాన విహరింపజేసే ఈ హోలీ పర్వదినం వసంత రుతువులో నిండు పౌర్ణమి నాడు వస్తుంది. ఈ దినాల్లో ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఆనందించడమనేది సహజంగా మారింది. అయితే హోలీలో ఉపయోగించే వాటిల్లో రసాయనాలు వాడొద్దని మేము చైతన్యం కల్పిస్తున్నాం. ఇళ్లలో తయారు చేసుకునే స్వచ్ఛమైన రంగులను మాత్రమే వాడడం వల్లే కళ్లకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ఇస్కాన్ సంస్థాపనాచార్య శ్రీచైతన్య మహాప్రభు ఆవిర్భావ దినోత్సవం, హోలీ పర్వదినాన్ని ఇస్కాన్ మందిరంలో సందడిగా నిర్వహిస్తున్నాం. 10 గంటల నుంచి ఆరంభమయ్యే వేడుకల్లో అందరూ సనాతన పర్వదిన వేడుకల్లో భాగస్వాములు కావాలి.

– దామోదర గౌరంగదాసు, జిల్లా ఇన్‌చార్జ్, ఇస్కాన్ మందిరం